https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505485656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 18 మంగళవారం 12-05-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు 9989788438, 9505485656.

## నెల రోజులపాటు టీఆర్ఎస్ జెండా పండుగ: కవిత




**హైదరాబాద్, మే 11 :**
తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ నెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధానితోపాటు జిల్లా కేంద్రాలు, మండల, గ్రామస్థాయి వరకు ప్రతివార్డులో జెండాలు ఎగుర వేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనమంతా కూడా ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## కేసు విచారణ బాధ్యతలు రితిరాజ్‌కు



**హైదరాబాద్ సిటీ, మే 11**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విచారణకు సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్ ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు విచారణ పర్యవేక్షణ బాధ్యతలను కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌కు సైబరాబాద్ సీపీ అప్పగించారు. విచారణ పురోగతిని ప్రతిరోజూ తనకు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో డీసీపీ రితిరాజ్ వెంటనే రంగంలోకి దిగారు. సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోల?సస్టేషన్‌కు చేరుకొని కేసు వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలితో మరోసారి మాట్లాడతానని, ఆధారాలు సేకరించి చర్యలు తీసుకుంటామని అన్నారు. చట్టప్రకారం బాధితులకు ఎలాంటి న్యాయం చేయాలో చేస్తామని చెప్పారు.

# ఒత్తిడితో భారత్‌ను లొంగదీసుకోలేరు!

## ప్రపంచంలో ఆ శక్తి ఎవరికీ లేదు: ప్రధాని మోదీ

**1951 మే 11న సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ**

**పోఖ్రాన్‌లో అణుపరీక్షలు జరిపిందీ మే 11నే**

**దేశానికే తొలి ప్రాధాన్యమని అప్పుడే చాటాం**

**సోమనాథ్ అమృత్ మహోత్సవ్‌లో మోదీ వెల్లడి**

**ఆలయంలో మహాపూజ, జలాభిషేకం**



సోమనాథ్(గుజరాత్), మే 11:
ఒత్తిళ్లు తెచ్చి భారత్‌ను లొంగదీసుకునే శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. అమెరికా ఎంత ఒత్తిడి తెచ్చినా.. వాజపేయి ప్రభుత్వ హయాంలో పోఖ్రాన్‌లో జరిపిన అణుపరీక్షల గురించి ఈ సందర్భంగా గుర్తుచేశారు. సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ జరిగి 75 ఏళ్లయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన సోమనాథ్ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జాతి ఆత్మగౌరవాన్ని కాదని.. బుజ్జగింపు రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చే శక్తులు దేశంలో ఉన్నాయన్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ఇదే మనస్తత్వంతో వ్యతిరేకించారని ఆక్షేపించారు. '1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. 1951 మే 11న సోమనాథ్ ఆలయ ప్రాణప్రతిష్ఠ.. సిసలైన స్వాతంత్ర్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ అమృత మహోత్సవ్ గతాన్ని నెమరువేసుకునే సందర్భం మాత్రమే కాదు.. వచ్చే వెయ్యేళ్ల వరకు భారత్‌కు స్ఫూర్తిగా నిలుస్తుంది. మే 11 ఎంతో కీలకమైన రోజు. 1951లో ఇదే రోజు సోమనాథ్ ఆలయ ప్రతిష్ఠ జరిగింది. మళ్లీ 1998లో ఇదే రోజున భారత్ అణుపరీక్షలు నిర్వహించింది. మన శాస్త్రవేత్తలు భారత సత్తా, సామర్థ్యాన్ని యావత్ ప్రపంచానికి చాటారని నాటి ప్రధాని వాజపేయి ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేగాయి. పలు దేశాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఆంక్షలు, ఆర్థిక ఒత్తిళ్లతో భారత్‌ను ఒంటరిని చేసేందుకు అగ్రరాజ్యాలు ప్రయత్నించాయి. మన ఆర్థిక పురోగతికి అడ్డంకులు సృష్టించాయి. ఇలాంటి పరిస్థితులు వస్తే చాలా దేశాలు లొంగిపోతాయి. కానీ భారత్ దృఢంగా నిలిచింది. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చినా.. రెండ్రోజులకే అంటే మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించింది. భారత రాజకీయ సంకల్పాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది' అని తెలిపారు. దేశానికే తొలి ప్రాధాన్యమని వాజపేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తేల్చిచెప్పిందన్నారు. పదే పదే దండయాత్రలతో సోమనాథ్ వైభవాన్ని తుడిచిపెట్టేయాలని దురాక్రమణదారులు భావించారని.. ఆలయాన్ని ఎన్ని సార్లు ధ్వంసం చేసినా పునర్నిర్మాణం జరిగిందని చెప్పారు. జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాలనూ మన దేశంలో రాజకీయం చేస్తారని, సోమనాథ్ దీనికి నిదర్శనమని అన్నారు. ఈ ఆలయ నిర్మాణం కోసం సర్దార్ పటేల్, ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అపారమైన కృషిచేశారని.. ప్రథమ ప్రధాని నెహ్రూ ఎంతో వ్యతిరేకించారని తెలిపారు. తొలుత ప్రధాని హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్‌జీ సర్కిల్ వరకు ఒకటిన్నర కిలోమీటర్లు రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రజలు జెండాలు ఊపుతూ నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. దారిపొడవునా పశ్చిమ బెంగాల్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. తర్వాత ఆయన ఆలయంలో ప్రవేశించి మహాపూజ, శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలను క్రేన్ ద్వారా ఆలయ శిఖరంపై చల్లుతూ జరిపిన కుంభాభిషేకాన్ని వీక్షించారు. గగనతలంలో భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబిక్స్ టీం 'ఎయిర్‌షో'ను సైతం తిలకించారు. సూర్యకిరణ్ యుద్ధవిమానాల నుంచి వదిలిన త్రివర్ణాల పొగ ఆకాశంలో భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగి 75 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని.. ప్రధాని ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, డిప్యూటీ సీఎం హర్ష్ సంఘవి సైతం పాల్గొన్నారు.

# కలవమంది కేంద్రంతోనే!

**మోదీ చెప్పింది రాష్ట్రాభివృద్ధి గురించే.. అందులో రాజకీయాలకు తావులేదు**

**వేరేగా అనుకుంటే అవగాహన లోపమే**

**బీజేపీ ప్రజల్ని విభజించి పాలించే పార్టీ**

**కలిసిరాకుంటే ఖతం చేయడం వారి విధానం**

**మోదీ.. గాలి తిని బతకమంటున్నారు**

**తెలంగాణలో గెలుస్తామని భ్రమ పడుతున్నారు**

**బీజేపీ తిరిగి రెండు సీట్ల పార్టీగా మారుతుంది**

**మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి**




హైదరాబాద్, మే 11
ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవమని చెప్పింది కేంద్ర ప్రభుత్వంతో మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అది కూడా రాష్ట్ర అభివృద్ధి కోసమేనని తేల్చిచెప్పారు. దాన్ని వేరేవిధంగా అర్థం చేసుకున్నారంటే అది వారి అవగాహన లోపమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించాలని తాను కోరానని గుర్తు చేశారు. ప్రధాని కూడా అదే ఉద్దేశంతో స్పందిస్తూ, కేంద్రంతో కలవాలని ఆహ్వానించారని, అందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. అభివృద్ధి ఒక్కరితోనే సాధ్యం కాదని, కేంద్రంతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న భావనతోనే మోదీ అలా అన్నారని తెలిపారు. ఆదివారం హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసింది అధికారిక కార్యక్రమం అని చెప్పారు. అభివృద్ధి-సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సోమవారం రేవంత్‌రెడ్డి తన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు ప్రాజెక్టులకు ఆమోదం రావడం లేదని చెప్పారు. గత పదేళ్లలో కేసీఆర్ కేంద్రాన్ని ఏమీ అడగలేదని, పైగా మీ నిధులు వద్దని, ప్రేమ చాలంటూ మెదక్ సభలో మోదీతో కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. దేశ ప్రజలు ఏడాది పాటు బంగారం కొనొద్దని, పెట్రోల్, డీజీల్ వినియోగాన్ని తగ్గించాలని, విమానం ఎక్కొద్దంటూ మోదీ పిలుపునివ్వడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్రం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలపై నిషేధం విధిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షోభం పీకల మీదకు వచ్చాక మోదీ ప్రజలకు పొదుపు మంత్రం ఉపదేశిస్తున్నారని మండిపడ్డారు. విదేశాంగ విధానంలో ప్రతిపక్షాల సూచనలను తీసుకోకుండా అహంకారంతో వ్యవహరించి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టారన్నారు. తెలంగాణ ప్రజలను గాలి తిని గాల్లో బతకమని మోదీ చెప్పి వెళ్లారని ఎద్దేవా చేశారు. బీజేపీకి సంక్షోభాలు సృష్టించడమే తప్ప మేనేజ్ చేయడం చేతకాదన్నారు. రాహుల్‌గాంధీ గత ఆర్నెల్లుగా చెబుతున్న విషయాన్నే ఇప్పుడు కేంద్రం చెబుతోందని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది నుంచి పాఠశాల దరఖాస్తుల్లో యాంటీ డ్రగ్ అనే కాలమ్ పెట్టామని రేవంత్ తెలిపారు. మూసీ మొదటి దశకు రూ.7,500కోట్లు అవసరమని తేలిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రీజినల్ రింగు రోడ్డు దక్షిణభాగం, మెట్రో రెండో దశ సహా పలు అంశాలపై జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం, మామునూరు విమానాశ్రయం, ఎలివేటెడ్ కారిడార్లకు రక్షణ శాఖ భూములు, మూసీకి ఏడీబీ నుంచి రుణం, బుల్లెట్ రైళ్లు లాంటి కొన్నింటినే ఇచ్చిందని తెలిపారు. అవి కూడా ఎప్పుడో రావాల్సినవని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇన్నాళ్లు పెండింగ్‌లో పడ్డాయని చెప్పారు.


# ఏపీ పిలుస్తోంది..

**22 నెలల్లో 22 లక్షల కోట్ల పెట్టుబడులు: సీఎం చంద్రబాబు**

**ఇదే లక్ష్యంతో ప్రణాళికాబద్ధ కార్యాచరణ.. టెక్నాలజీ ఇంటిగ్రేటెడ్ సిటీగా అమరావతి**

**విశాఖకు గూగుల్.. త్వరలో రిలయన్స్ కూడా.. పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్‌కు రండి..**

**సీఐఐ సదస్సులో పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం**



**న్యూఢిల్లీ, మే 11**
శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్, పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి ఏపీ రెండు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక వ్యాపార సదస్సులో సీఎం మాట్లాడారు. గడచిన 22 నెలల్లో రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలను తీసుకురాగలిగామన్నారు. భారత గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా 160 గిగావాట్లను ఏపీలోనే ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశంలో పురోగతి నిరాఘాటంగా, ఎవరూ అడ్డుకోని విధంగా సాగుతోంది. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు లభించారు. ప్రస్తుత అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోడానికి మోదీ హైదరాబాద్ లో సూచించిన కీలక చర్యలను అందరూ పాటించాలి. బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం, ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవడం, పబ్లిక్ రవాణాను ఉపయోగించడం, ఇంటినుంచే పనిచేసే సంస్కృతిని అవలంబించడం, ఎరువుల వినియోగం తగ్గించడం వంటి చర్యల్ని మోదీ సూచించారు. విదేశీ నిల్వలను పటిష్ఠం చేసే ఆ సూచనలకు, ఆయన మిషన్‌కు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాలి. దీనివల్ల వనరులను కాపాడుకోవడమేగాక, స్వయం సమృద్ధిని సాధించగలం. మోదీ నేతృత్వంలో దేశం అగ్రస్థానానికి చేరుకోవడం, అంతర్జాతీయ శక్తిగా మారడం ఖాయం. ప్రతి సవాలునూ అవకాశంగా మార్చుకోవడమే ధ్యేయం. పరిశ్రమలు తమ విద్యుత్ ను తామే ఉత్పత్తి చేసుకోవాలి. ప్రతి కుటుంబం, ప్రతివారు బయటి వనరులపై ఇంధనం కోసం ఆధారపడడం తగ్గించాలి. యుద్ధంలో నేరుగా పాల్గొననివారు కూడా, దాని పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తోంది." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "సీఐఐతో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. సీఐఐ సహకారంతో నేను పెట్టుబడులను ఆకర్షించాను. దేశ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలే నాకు ఎజెండా. పరిజ్ఞానం, టెక్నాలజీ, వేగం అనే అంశాలపైనే ప్రపంచ పోటీ నడుస్తోంది. క్వాంటం, ఏఐ, మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటలిజెంట్ లాజిస్టిక్స్ రంగాలను అందిపుచ్చుకునేలా పనిచేస్తున్నాం. టెలికమ్ డీ రెగ్యులేషన్, ఓపెన్ స్కై విధానం, విద్యుత్ సంస్కరణలు, రహదారులు తదితర రంగాల్లో జరిగిన విప్లవాత్మక మార్పుల్లో భాగస్వామిని కావడం సంతోషంగా ఉంది." "దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి.

# అన్నాడీఎంకేలో సంక్షోభం..

**పళనిని శాసనసభా పక్షనేతగా ఎన్నుకున్న 17 మంది ఎమ్మెల్యేలు**

**వేలుమణికి మద్దతుగా 30 మంది**

**టీవీకేతో పొత్తుకు మణి వర్గం సిద్ధం**



**చెన్నై, మే 11:**
తమిళనాడు ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయిన అన్నాడీఎంకే పార్టీలో సంక్షోభం నెలకొంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి ని శాసనసభా నేతగా ఎన్నుకుంటూ 17 మంది ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ కరుప్ప య్యకు లేఖ రాశారు. అదేసమయంలో సీని యర్ నేత ఎస్పీ వేలుమణిని శాసనస భానేతగా, సీవీ షణ్ముగంను డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా ఎన్ను కుంటూ మరో 30 మంది ఎమ్మెల్యేలు సంత కాలు చేశారు. దీంతో అన్నాడీఎంకేలో చీలిక ఏర్పడడం ఖాయమని తెలుస్తోంది. అదేసమ యంలో చీలిక వర్గం అధికార టీవీకేకు మద్దతు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. వాస్తవానికి ఎన్నికలకు ముందే పలువురు నేతలు బీజేపీతో పొత్తును వ్యతిరేకించి, టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని ఈపీఎ?సకు చెప్పారు. అయితే, ఢిల్లీ నుంచి వచ్చిన ఒత్తిళు ,, టీవీకే నుంచి ఎదురైన డిమాండ్ల నేపథ్యంలో ఈపీఎస్ బీజేపీతో పొత్తుకే మొగ్గు చూపారు. కానీ, ఇప్పుడు విజయ్ పార్టీ అధికారంలోకి రావడంతో అసమ్మతి ఎమ్మెల్యేలు ఎస్పీ వేలు మణి, సీవీ షణ్ముగం, సి. భాస్కర్ తదితరుల నేతృత్వంలో ఆదివారం రాత్రి భేటీ అయ్యారు. సోమవారం ఉదయం అసెంబ్లీకి ప్రత్యేకంగా వచ్చారు. అంతేకాదు, అన్నా డీఎంకే ఎమ్మెల్యేలతో కాకుండా వేరుగా కూర్చు న్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసే ముందుగానీ, ఆ తర్వాత గానీ తమ అధినేత ఈపీఎస్ వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. అదేసమయంలో వారంతా విజయ్‌కు నమస్క రించడం గమనార్హం.

# లాడ్జీలు, ఫాంహౌస్‌లపై పోలీసుల డేగ కన్ను

**- భద్రతా నిబంధనలు తప్పనిసరి - ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు - సిద్దిపేట జిల్లా సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



**సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్**



**హాజరైన జిల్లాలోని వివిధ పోలీస్ ఠాణాల అధికారులు సిబ్బంది**

**సిద్దిపేట, మే 11**

నగరంలోని లాడ్జీలు, రిసార్ట్స్, హోటల్స్, ఫాంహౌస్‌లలో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, స్పష్టం చేశారు. ప్రజల భద్రతే లక్ష్యంగా అన్ని వసతి కేంద్రాలు అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరిస్తూ యాజమాన్యాలు, మేనేజర్లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ పలు కీలక సూచనలు చేస్తూ, ప్రతి హోటల్, లాడ్జి, ఫాంహౌస్ ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలను నియంత్రించేందుకు నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 60 రోజుల వరకు వీడియో బ్యాకప్ భద్రపరచాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందన కోసం ప్రత్యేక ప్రవేశ – నిష్క్రమణ గేట్లు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులకు ఫైర్ సేఫ్టీపై ప్రాథమిక శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఉద్యోగుల పూర్తి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, మైనర్లను ఉద్యోగాల్లో నియమించరాదని హెచ్చరించారు. నకిలీ ఆధార్ కార్డుల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పెద్ద ఎత్తున నిర్వహించే ఈవెంట్లు, పార్టీలు, కార్యక్రమాలకు ముందస్తుగా పోలీస్ అనుమతి తీసుకోవాలని, బసకు వచ్చే ప్రతి కస్టమర్ పూర్తి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ప్రతిరోజూ అందజేయాలని ఆదేశించారు. కొత్తగా రూములు తీసుకునే వారి వివరాలు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, నగరంలోని లాడ్జీలు, రిసార్ట్స్, ఫాంహౌస్‌లు, హోటల్స్‌పై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని సీపీ స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం కల్పిస్తే యాజమాన్యాలపైనే బాధ్యత ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ కుషాల్కర్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# లంచం తీసు'కొంటూ'ఏసీబీ కి చిక్కిన

# కొమురవెల్లి జిపి కార్యదర్శి, సర్పంచ్ భర్త

**గ్రామపంచాయతీ కార్యాలయంలోనే మెరుపుదాడి**

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**



**పట్టుపడ్డ కార్యదర్శి సర్పంచ్ భర్త**

**కొమురవెల్లి, మే 11**

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన మెరుపుదాడి సంచలనం సృష్టించింది. గ్రామపంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్‌తో పాటు సర్పంచ్ భర్త గొల్లపల్లి ఆంజనేయులు సోమవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం... కొమురవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్‌లో గ్రామపంచాయతీ అధికారులు డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో తన స్థలానికి ఇబ్బందులు కలుగుతున్నాయని, పైప్‌లైన్‌ను అక్కడి నుంచి తొలగించాలని బాధితుడు గ్రామపంచాయతీ అధికారులను కోరాడు. అయితే ఈ పనిని చేయాలంటే రూ.10 వేల లంచం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. లంచం ఇవ్వడానికి ఇష్టపడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలోనే సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి ఆంజనేయులు, కార్యదర్శి ఆదేశాల మేరకు రూ.10 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. అధికారులు వారి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకొని, పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్‌తో పాటు సర్పంచ్ భర్త ఆంజనేయులును అరెస్టు చేశారు. అనంతరం వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో కొమురవెల్లి గ్రామంలో అవినీతి వ్యవహారాలపై చర్చనీయాంశంగా మారింది.

# పశ్చిమ బెంగాల్ సీఎంవోలో కలకలం

**సువేందు అధికారి పీఏ హత్య కేసులో ముగ్గురికి 13 రోజుల పోలీస్ కస్టడీ**

**యూపీఐ చెల్లింపుతో నిందితుల జాడ కనిపెట్టిన పోలీసులు**

**వృత్తిపరమైన హంతకుల కోణంలో దర్యాప్తు ముమ్మరం**







**బారాసాత్, మే 11**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన కీలక వ్యక్తి చంద్రనాథ్ రథ్ హత్య కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న చంద్రనాథ్ రథ్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను పోలీసులు బారాసాత్ కోర్టులో హాజరుపర్చారు. విచారణలో కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని పోలీసులు కోర్టుకు వివరించగా, కోర్టు వారికి 13 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. దీంతో నిందితులను ప్రత్యేక బృందాలు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించాయి. హత్య వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటి..? రాజకీయ కోణం ఉందా..? వ్యక్తిగత విభేదాలా..? లేక ఎవరైనా ప్రేరేపించి హత్య చేయించారా..? అనే అనేక అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు వృత్తిపరమైన హంతకులని ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు మరింత సంచలనంగా మారింది. వీరికి ఇతర రాష్ట్రాల నేర గ్యాంగ్‌లతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. గత బుధవారం జరిగిన ఈ హత్య తర్వాత నిందితులు పరారీలోకి వెళ్లిపోయారు. అయితే కోల్‌కతా సమీపంలోని బ్యాలీ టోల్ ప్లాజా వద్ద చేసిన యూపీఐ చెల్లింపు పోలీసులకు కీలక ఆధారంగా మారింది. ఆ డిజిటల్ లావాదేవీల ఆధారంగా పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి విశాల్ శ్రీవాస్తవ, రాజ్ సింగ్, మయాంక్ మిశ్రాలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హత్య జరిగిన రాత్రి చంద్రనాథ్ రథ్ తన ఇంటికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న సమయంలో దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆయన మహీంద్రా స్కార్పియో వాహనం ముందు సీటులో కూర్చుని ఉండగా అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేశారు. మొదట సిల్వర్ రంగు నిస్సాన్ మైక్రా కారుతో ఆయన వాహనాన్ని అడ్డగించగా, వెంటనే బైక్‌పై వచ్చిన హంతకులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.దాడి అనంతరం నిందితులు సంఘటన స్థలంలోనే మైక్రా కారును వదిలేసి మరో ఎరుపు రంగు కారు, బైక్‌లపై పారిపోయారు. సీసీటీవీ దృశ్యాలను విశ్లేషించిన పోలీసులు మైక్రా కారును గుర్తించి దాని కదలికలను ట్రాక్ చేశారు. టోల్ ప్లాజా వద్ద జరిగిన యూపీఐ చెల్లింపుల వివరాలు సేకరించి నిందితుల వివరాలను బయటకు తీశారు. ఈ ఆధారాలతో వారిని బీహార్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితుల్లో విశాల్ శ్రీవాస్తవపై హత్య, దోపిడీ సహా 15కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురూ కాంట్రాక్ట్ హత్యలు చేసే నేరగాళ్లుగా గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం వీరి ఫోన్ కాల్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సంబంధాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు మాస్టర్‌మైండ్‌ను బయటపెట్టేందుకు దర్యాప్తు వేగవంతం చేశారు.

# ప్రజలు ఆందోళన చెందొద్దు

**అవసరమైన వస్తువుల సరఫరాపై కేంద్రం ప్రత్యేక దృష్టి**

**పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం**

**ఇంధన భద్రత కోసం సమష్టిగా సహకరించాలని పిలుపు**




**న్యూఢిల్లీ, మే 11:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ఇంధన సరఫరా, అవసరమైన వస్తువుల లభ్యతపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం ఐదో సమావేశం సోమవారం నిర్వహించినట్లు వెల్లడించారు. దేశంలో సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన రాజ్‌నాథ్ సింగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని వస్తువుల సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ఇంధన సరఫరా గొలుసులు, కీలక వస్తువుల లభ్యతపై ఉన్న ప్రమాదాలను సమీక్షించినట్లు చెప్పారు. దేశ ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, భయాందోళనలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇంధన భద్రత సాధనలో స్వయం సమృద్ధి కీలకమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపు దేశాన్ని మరింత బలమైన దిశగా తీసుకెళ్తుందని అన్నారు. కష్టకాలంలో వనరుల సంరక్షణ, బాధ్యతాయుత వినియోగం దేశ ప్రయోజనాలకు ఎంతో అవసరమని వివరించారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడే అవకాశాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహిస్తోంది. దేశీయ మార్కెట్లో అవసరమైన వస్తువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇక ఇంధన వినియోగంలో మితవ్యయం పాటించడం, దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ పరిస్థితులు ఎలా మారినా దేశ ప్రజలకు అవసరమైన వస్తువుల సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కేంద్రం స్పష్టం చేసింది.

# తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్, సభ్యుల నియామకం

**- జీవో ఆర్టీ నెం.637 విడుదల చేసిన ప్రభుత్వం**

**- మహిళా హక్కుల పరిరక్షణకు కమిషన్ బలోపేతం**

**- ఆరుగురు సభ్యులతో కొత్త కమిషన్ ఏర్పాటు**



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Appointment of Chairperson and Members to the Telangana Women's Commission – Orders – Issued.

GENERAL ADMINISTRATION (GENERAL, L&C) DEPARTMENT

G.O.Rt.No.637 Dated: 11.05.2026

***

ORDER:

In exercise of the powers conferred under Section (5) of the Telangana Women's Commission Act, 1998 (Act No.9 of 1998, adopted for the State of Telangana vide G.O.Ms.No.45, Law (F) Department, Dated:01.06.2016), the Government of Telangana hereby appoints the following persons as Chairperson and Members to the Telangana Women's Commission:

| Sl.No. | Name | Designation |
|---|---|---|
| 1. | Smt. Gadwal Vijay Laxmi | Chairperson |
| 2. | Smt. Kasoju Sankaramma | Member |
| 3. | Smt. Chityala Swetha | Member |
| 4. | Smt. Shashikala Yadava Reddy | Member |
| 5. | Smt. Sada Laxmi | Member |
| 6. | Smt. N. Radha Bai | Member |
| 7. | Smt. Ujma Ashai Shakira | Member |

2. The term of the Chairperson and the Members will be for a period of five (5) years from the date on which they assume office.

3. The terms and conditions of appointment will be issued separately by the Department for Women, Children Disabled and Senior Citizens.

( BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

K.RAMAKRISHNA RAO
CHIEF SECRETARY TO GOVERNMENT

To
Smt. Gadwal Vijay Laxmi
Smt. Kasoju Sankaramma
Smt. Chityala Swetha
Smt. Shashikala Yadava Reddy
Smt. Sada Laxmi
Smt. N. Radha Bai
Smt. Ujma Ashai Shakira
Copy to:-
The P.S. to Chief Secretary to Government.
The P.S. to Principal Secretary to C.M.
The P.S. to Principal Secretary to Government (Poll.),G.A.D
The P.S to Secretary to Government, WCD&SC Department.
The Director WD&CW Department.
All The District Collectors
The Director Treasuries and Accounts, Hyderabad.
The Pay & Accounts Officer, Telangana, Hyderabad.
The Accountant General, Hyderabad.
SF/SC.

// FORWARDED: : BY ORDER//

SECTION OFFICER

**హైదరాబాద్, మే 11**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్‌తో పాటు ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 637ను విడుదల చేసింది. మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సాధికారత కోసం పనిచేసే మహిళా కమిషన్‌ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. చైర్‌పర్సన్‌తో పాటు మొత్తం ఆరుగురు సభ్యులను కమిషన్‌లో భాగస్వామ్యం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్తగా ఏర్పడిన మహిళా కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించనుంది. మహిళలపై జరిగే వివక్ష, వేధింపులు, హింస వంటి అంశాలపై ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యల కోసం సంబంధిత శాఖలతో సమన్వయం చేయనుంది. అలాగే మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మహిళా సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ, సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి బాధ్యతలను కమిషన్ నిర్వహించనుంది.మహిళల భద్రత, సమాన హక్కుల పరిరక్షణలో మహిళా కమిషన్ కీలక వేదికగా పనిచేస్తుందని అధికారులు పేర్కొన్నారు. మహిళలకు న్యాయం జరిగేలా చట్టపరమైన అవగాహన కల్పించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. కొత్త కమిషన్ ఏర్పాటుతో మహిళల సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలులో కమిషన్ చురుకైన పాత్ర పోషించనుంది.


# నిమ్స్‌కు కొత్త డైరెక్టరా.. కొనసాగింపేనా?

**హైదరాబాద్, మే 11**

నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ పదవీ కాలం జూన్ 7తో ముగియనుంది. ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ బీరప్పనే కొనసాగిస్తారా.. లేక కొత్తవారికి కాంగ్రెస్ సర్కారు అవకాశం ఇస్తుందా.. అన్న దానిపై ఇంతవరకు స్పష్టత రాలేదు. నిబంధనల ప్రకారమైతే కొత్త డైరెక్టర్ నియామకం చేపట్టాలంటే నెల రోజుల ముందుగానే కసరత్తు ప్రారంభించాలి. ముందుగా డైరెక్టర్ నియామకం కోసం సెర్చ్ కమిటీని వేయాలి. ఆ సెర్చ్ కమిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి సర్కారుకు పంపిస్తుంది. తర్వాత ప్రభుత్వం వారిలో నుంచి ఒకరిని ఎంపిక చేస్తుంది. అయితే, ఇప్పటివరకు సెర్చ్ కమిటీ వేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న డైరెక్టర్‌నే కొనసాగిస్తారన్న ఊహాగానాలు వస్తున్నాయి.

# మీ ఇంట్లోనే ఈ నాచురల్ మౌత్ వాష్‌ల తయారీ

## అన్ని రకాల నోటి సమస్యలు తగ్గుతాయి..



నోరు శుభ్రంగా ఉంటేనే నోటి దుర్వాసన ఉండదు. దంతాలు, చిగుళ్ల దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. నోటిని శుభ్రంగా ఉంచుకోకపోతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నోట్లో బ్యాక్టీరియా పెరిగి దుర్వాసన వస్తుంది. దీంతో నలుగురిలో మాట్లాడాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. నోరు శుభ్రంగా లేకపోతే దంతాలు, చిగుళ్లలో బ్యాక్టీరియా పెరిగి నొప్పులు వస్తాయి. దంత క్షయం కూడా ఇబ్బందులకు గురి చేస్తుంది. చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంటుంది. నోరు శుభ్రంగా లేకపోతే ఇన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కనుక నోటిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకు గాను దంతాలను రోజుకు 2 సార్లు శుభ్రం చేయాలి. అలాగే మౌత్ వాష్‌లను ఉపయోగించాలి. అయితే మార్కెట్‌లో మనకు అనేక రకాల మౌత్ వాష్‌లు లభిసు_న్నాయి. కానీ మనం ఇంట్లోనే చాలా సులభంగా మౌత్ వాష్‌లను తయారు చేసి ఉపయోగించవచ్చు. వీటి వల్ల నోరు శుభ్రంగా ఉంటుంది. అన్ని రకాల నోటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

**కొబ్బరినూనె..**

మన అందరి ఇళ్లలోనూ కొబ్బరినూనె ఉంటుంది. దీన్ని చాలా మంది వంటలకు లేదా జుట్టు సమస్యలకు, చర్మ సంరక్షణకు ఉపయోగిస్తారు. కానీ కొబ్బరినూనె నోటి సమస్యలకు కూడా పనిచేస్తుంది. దీన్ని సహజసిద్ధమైన మౌత్ వాష్‌గా కూడా ఉపయోగించవచ్చు. కొబ్బరినూనెలో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక దీన్ని ఉపయోగిస్తే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గిపోతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కొద్దిగా కొబ్బరినూనెను తీసుకుని నోట్లో పోసుకుని 10 నుంచి 15 నిమిషాల పాటు బాగా పుక్కిలించాలి. అనంతరం నూనెను ఉమ్మేయాలి. తరువాత గోరు వెచ్చని నీటితో పుక్కిలించాలి. ఇలా చేస్తుండడం వల్ల నోరు శుభ్రంగా ఉంటుంది. అన్ని రకాల నోటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

**ఉప్పు నీళ్లు, కలబంద రసం..**

ఉప్పు నీళ్లను కూడా సహజసిద్ధమైన మౌత్ వాష్‌గా ఉపయోగించవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 1 టీస్పూన్ ఉప్పు వేసి బాగా కలిపి అనంతరం ఆ నీళ్లతో నోటిని బాగా పుక్కిలించాలి. నీళ్లు అయిపోయే వరకు 10 నిమిషాల పాటు బాగా పుక్కిలిస్తుండాలి. ఇలా చేయడం వల్ల కూడా నోరు శుభ్రంగా మారుతుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల సమస్యల నుంచి బయట పడవచ్చు. అలాగే సహజసిద్ధమైన మౌత్ వాష్‌గా కలబంద రసం కూడా ఎంతో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందుకు గాను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసం కలపాలి. అనంతరం దాంతో నోటిని పుక్కిలించాలి. ఇలా చేస్తుండడం వల్ల కూడా నోటి సమస్యలను తగ్గించుకోవచ్చు. దంతాలు, చిగుళ్లను రక్షించడంలో ఈ రసం కూడా అద్భుతంగా పనిచేస్తుంది. దీని వల్ల దంతాల మధ్య ఉండే పాచి తొలగిపోతుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.

**దాల్చిన చెక్క నూనె, లవంగాల నూనె..**

దాల్చిన చెక్క నూనె, లవంగాల నూనె మిశ్రమాన్ని కూడా మౌత్ వాష్‌గా ఉపయోగించవచ్చు. ఇందుకు గాను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 10 చుక్కల దాల్చిన చెక్క నూనె, 10 చుక్కల లవంగాల నూనె వేసి బాగా కలపాలి. అనంతరం ఈ నీళ్లను కొద్ది కొద్దిగా నోట్లో పోసుకుని బాగా పుక్కిలించాలి. నీరు అయిపోయే వరకు ఇలా చేయాలి. రోజూ ఇలా చేస్తుండడం వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దాల్చిన చెక్క నూనె, లవంగాల నూనెల్లో అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ నూనెలు యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక నోట్లో ఉండే బ్యాక్టీరియా సమూలంగా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. దంత క్షయం ఉన్నవారికి ఈ చిట్కా అద్భుతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమాన్ని 2 రోజులకు ఒకసారి వాడినా కూడా ఎంతగానో ఫలితం ఉంటుంది. ఇలా ఈ సహజసిద్ధమైన మౌత్ వాష్‌లలో దేన్ని ఉపయోగించినా సరే అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని చెబుతున్న సైంటిస్టులు..

## ఎందుకో తెలిస్తే మీరు కూడా అలాగే చేస్తారు..

పూర్వం ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసే వారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కలిగి ఉండేవారు. రోజూ బలవర్ధకమైన ఆహారం తినేవారు. అంతేకాదు రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారు. త్వరగా నిద్రించేవారు. ఉదయం త్వరగా నిద్రలేచేవారు. ఇలా అన్ని రకాలుగా వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించేవారు. కనుకనే ఎన్నో ఏళ్ల పాటు వారు ఆరోగ్యంగా జీవించ గలిగారు. అయితే అప్పట్లో ప్రజలు అంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పౌష్టికాహారం తీసుకోవడం మాత్రమే కాకుండా రాత్రి పూట త్వరగా భోజనం చేయడమే అని చెప్పవచ్చు. సైంటిస్టులు ఈ విషయంపై అధ్యయనాలు కూడా చేపట్టి వాస్తవమే అని తేల్చారు. ఈ క్రమంలోనే రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని, దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతా యని సూచిస్తున్నారు.రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. భోజనాన్ని కనీసం రాత్రి 7.30 గంటల లోపు ముగించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట త్వరగా భోజనం చేయాలి. దీని వల్ల మనం తిన్న ఆహారం నుంచి వచ్చే శక్తిని ఖర్చు పెట్టేందుకు శరీరానికి తగిన సమయం లభిస్తుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు తప్పనిసరిగా ఈ సూచనను పాటించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరకుండా చూసుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. దీని వల్ల ఊబకాయం బారిన పడకుండా ఉంటారు. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అంటున్నారు. త్వరగా భోజనం ముగించే పురుషులకు 26 శాతం వరకు క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. అదే స్త్రీలకు అయితే 16 శాతం వరకు క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుంది. రాత్రి త్వరగా భోజనం చేసి త్వరగా నిద్రించడం వల్ల ఉదయం త్వరగా నిద్రలేస్తారు. దీని వల్ల నిద్రలేమి ఉండదు. పైగా ఉదయం నిద్ర లేచిన వెంటనే యాక్టివ్‌గా ఉన్నట్లు ఫీలవుతారు. శరీరానికి శక్తి లభించినట్లు ఉత్సాహం వస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. బద్ధకం పోతుంది.

# పార్టీ బలోపేతానికే పట్టణ కమిటీల ఏర్పాటు..

## జిల్లా, పట్టణ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్

**రామకృష్ణాపూర్, మే 11, (మన సమాజం):**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయి పట్టణ కమిటీలు వేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని వార్డుల నుండి పార్టీకి కష్టపడి పనిచేసే వారి నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల్లోనే పట్టణ కమిటీని ప్రకటిస్తామని, ప్రతి కార్యకర్త పార్టీ గెలుపుకు కృషి చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. హింసను ప్రోత్సహించిన బాల్క సుమన్ పై చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు. అనవసర, అసత్య ప్రచారాలు మంత్రి వివేక్, కాంగ్రెస్ పార్టీపై చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోపతి బానేష్, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, బీమా మల్లేష్, మాజీ చైర్మన్ జంగం కల, నాయకులు పనాసరాజు, గడ్డం శ్రీనివాస్, గోపు రాజం, నక్క శ్రీనివాస్, రామస్వామి, రాజ్ కుమార్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు..




# పెద్దలకు ప్రత్యేక ఆహారం!



మనదేశం 'యువ భారత్'గా వెలిగిపోతున్నది. గణాంకాలను పరిశీలిస్తే.. యువతే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నది. అదే సమయంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్యా.. ఇక్కడ అధికంగానే ఉన్నది. దాదాపు 14 కోట్ల మంది వృద్ధులకు భారత్ నీడనిసు_న్నది. 2050 నాటికి.. ఆ సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉన్నది. కానీ, పెద్దవాళ్ల ఆరోగ్యం మాత్రం అధిక నిర్లక్ష్యానికి గురవుతు న్నది. ఈ క్రమంలో వారి ఆరోగ్యానికి మందులతో కాకుండా.. ఆహారంతోనే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. వృద్ధాప్యం అంటే అనారోగ్యం కాదు. అదో శారీరక మార్పు మాత్రమే! వయసు పెరిగే కొద్దీ.. కండ ́రాల ద్రవ్యరాశి తగ్గుతుంది. రక్తంలో చక్కెరశాతం పెరుగుతుంది. ఫలితంగా, ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఈ క్రమంలో అనేక శారీరక మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పు లను అర్థం చేసుకుంటూ, అందుకు అనుగుణంగా ఆహా రాన్ని అందిస్తే.. వృద్ధుల ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది.

**పోషకాల అవసరం..**

వయసు పెరిగేకొద్దీ శరీరానికి పోషకాల అవసరం పెరుగుతుంది. కానీ, జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కడుపులోని ఆమ్లం, ఎంజైమ్‌ల స్థాయిలూ తగ్గుతాయి. ఫలితంగా, ప్రొటీన్ శోషణపై ప్రతికూల ప్రభావితం పడుతుంది. ఇలాంటి సమయంలో పెద్దవాళ్లకు గంజి, పులియబెట్టిన ఆహారాలు, తేలికైన సుగంధ ద్రవ్యాలు, అప్పుడే వండిన భోజనం అందించాలి. ఇవన్నీ జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. పోషకాల శోషణను మెరుగుపరుస్తాయి. పెద్దల ఆహారంలో కూరగాయలు ఎక్కువగా ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా పక్కన పెట్టాలి. ఇక ఒక్కపూట కూడా భోజనం మానేయడం మంచిదికాదు. పోషకాహారంతోపాటు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటే.. మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుంది. ఇక వృద్ధాప్యంలో పలకరించే బ్రెయిన్ ఫాగ్ కూడా ఆమడదూరం పారిపోతుంది. ఎందుకంటే.. న్యూరోట్రాన్స్‌మిటర్ కార్యకలాపాలు తగ్గడానికీ, శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వులు లేకపోవడానికీ సంబంధం ఉంటుందని పలు సర్వేలు తేల్చాయి కూడా.

# గాయాలు త్వరగా మానిపోవాలన్నా,

## నొప్పుల నుంచి ఉపశమనం లభించాలన్నా.. ఈ చిట్కాలను పాటించండి..

క్రీడల్లో పాల్గొన్నప్పుడు, వ్యాయామం లేదా శారీరక శ్రమ చేసినప్పుడు, పలు ఇతర సందర్భాల్లో మనకు అనుకోకుండా గాయాలు అవుతుంటాయి. అవి పుండ్లుగా కూడా మారుతుంటాయి. ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలో తీవ్రమైన నొప్పి కూడా ఉంటుంది. గాయాలు అయినప్పుడు రక్తస్రావం కూడా ఒక్కోసారి అధికంగా అవుతుంది. అయితే గాయాలు మరీ తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సాధారణ గాయాలు అయినప్పుడు, పుండ్లుగా మారినప్పుడు, నొప్పి ఉన్నప్పుడు పలు ఇంటి చిట్కాలను పాటిస్తే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. మన ఇండ్లలో లభించే సహజసి ద్ధమైన పదార్థాలను ఉపయో గించి గాయాలను, పుండ్లను, నొప్పిని సులభంగా తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆయా చిట్కాలు చాలా అద్భుతంగా పనిచేస్తాయి.

**ఆముదం, పసుపు..**

గాయాలు, పుండ్లు, నొప్పిని తగ్గించేందుకు ఆముదం అద్భుతంగా పనిచేస్తుంది. ఒక టీస్పూన్ ఆముదాన్ని తీసుకుని కొద్దిగా వేడి చేసి గాయంపై మర్దనా చేయాలి. తరువాత గాయం అయిన భాగాన్ని వస్త్రంతో చుట్టి కట్టులా కట్టాలి. 20 నుంచి 30 నిమిషాల పాటు అలాగే ఉంచి తరువాత తీసేయాలి. రాత్రి పూట కట్టు కడితే రాత్రంతా దాన్ని అలాగే ఉంచి మరుసటి రోజు ఉదయం తీసేయాలి. దీని వల్ల నూనె లోపలికి శోషించుకోబడుతుంది. దీంతో గాయం త్వరగా మానుతుంది. నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే గాయాలు, పుండ్లు, నొప్పులను తగ్గించేందుకు పసుపును కూడా ఉపయోగించవచ్చు. ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. కనుక నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పుండ్లు త్వరగా మానిపోతాయి. అన్ని రకాల గాయాలు, నొప్పులు, వాపులు తగ్గిపో తాయి. పావు టీస్పూన్ పసుపును ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కలిపి తాగాలి. ఉదయం, సాయం త్రం ఇలా చేయాల్సి ఉంటు ంది. దీని వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**అల్లం..**

గాయాలు, పుండ్లను తగ్గించేందుకు పసుపు, నెయ్యి మిశ్రమం కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందుకు గాను కొద్దిగా పసుపు, నెయ్యిని తీసుకుని బాగా కలిపి పేస్ట్‌లా మార్చాలి. అనంతరం గాయాన్ని లేదా పుండును శుభ్రం చేసి దానిపై ముందు సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని రాసి ఆపై కట్టు కట్టాలి. ఇలా రోజుకు 2 సార్లు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల గాయాలు, పుండ్లను త్వరగా మానేలా చేయవచ్చు. అలాగే అల్లంను తీసుకున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు. ఇవి నొప్పులను తగ్గించి గాయాలు త్వరగా మానేలా చేస్తాయి. రోజువారి ఆహారంలో అల్లంను చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా అల్లం ముక్కను నోట్లో వేసుకుని నమిలి మింగవచ్చు. లేదా అల్లం రసం తాగవచ్చు. అలాగే అల్లం రసం కలిపిన గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. దీని వల్ల కూడా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. గాయాలు త్వరగా మానుతాయి.

**ఆవనూనె..**

ఇక నొప్పులను తగ్గించి గాయాలు మానేలా చేయడంలో ఆవనూనె కూడా బాగానే పనిచేస్తుంది. ఇందులోనూ యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి మనకు ఎంతో మేలు చేస్తాయి. ఆవనూనెను కొద్దిగా తీసుకుని వేడి చేయాలి. అనంతరం దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసి సున్నితంగా మర్దనా చేయాలి. 15 నిమిషాల పాటు ఇలా చేయాల్సి ఉంటుంది. దీని వల్ల వాపు, నొప్పి తగ్గిపోతాయి. అలాగే గాయాలపై రాసి కట్టు కడితే అవి త్వరగా మానిపోతాయి. అలాగే గాయాలు అయినవారు, నొప్పులు ఉన్నవారు పలు ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పైనాపిల్ పండ్లను రోజూ తింటుండాలి. దానిమ్మ పండ్లను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటి జ్యూస్‌ను అయినా తాగవచ్చు. అలాగే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా అల్లం రసం, పసుపు వేసి కలిపి తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఈ విధంగా ఆయా చిట్కాలను పాటించడం వల్ల గాయాలు త్వరగా నయం అయ్యేలా చూసుకోవచ్చు. నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.





# అతని వల్లే డ్యాన్స్‌లో పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ఛమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

# రెండు వేలకు మించి ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

